


రాయదుర్గంలోని మల్కంచెరువు

మల్కం చెరువు.. మురుగు సమస్య

- మురుగునీటి మళ్లింపునకు ప్రత్యేక పైప్‌లైన్‌లు వేసినా ఫలితం లేదు
- ఇబ్బందిపడుతున్న వాకర్స్, సందర్శకులు



రాయదుర్గం: ఐటీ కారిడార్‌లో సుందరతటాకంగా పిలువబడుతున్న మల్కంచెరువు దుర్వాసన వెద జల్లుతుంది. మొత్తం 1500 మీటర్లలో కనీసం 50 మీటర్ల పొడవునా మురుగు వాసన వస్తోంది. దీంతో వాకర్లు ఇబ్బందిపడుతున్నారు. మల్కంచెరువు గొలుసుకట్టు చెరువు. దుర్గంచెరువు నుంచి మల్కంచెరువు అక్కడి నుంచి మణికొండవైపు చెరువుతో లింకు ఉంది. జీహెచ్‌ఎంసీ, అపర్ణా నిర్మాణ సంస్థ సీఎస్‌ఆర్ నిధులతో చెరువును అభివృద్ధి చేశారు. ఆ సమయంలో మురుగునీటి మళ్లింపునకు ప్రత్యేక పైప్‌లైన్‌లు వేశారు. అయినప్పటికీ వచ్చే మురుగునీటిని మూడు దశలలో సహజ పద్ధతిలో శుద్ధి చేసే నూతన ప్రక్రియను ఇక్కడ అమలు చేశారు. కానీ నీరు శుద్ధి చేసే క్రమంలో దుర్వాసన వస్తోందని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పెరుగుతున్న వాకర్స్ సంఖ్య..

మల్కంచెరువును సుందరీకరించిన తర్వాత వాకింగ్ ట్రాక్ చుట్టూ గ్రీనరీని అభివృద్ధి చేయడంతో వాకర్స్ సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. ముఖ్యంగా రాయదుర్గం, మణికొండ, పుప్పాలగూడ, హకీంపేట్, షేక్‌పేట్, పంచవటి కాలనీ, చిత్రపురి కాలనీ, మధురానగర్, గచ్చిబౌలి, టెలికామ్‌నగర్, ఫిల్మ్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి చాలా మంది వాకింగ్‌నిత్యం వస్తున్నారు.

50 అడుగుల వరకు వాసన



మొత్తం 1500 మీటర్ల ట్రాక్‌లో 50 మీటర్ల వరకు దుర్వాసన వస్తున్నది.వెంటనే చర్యలు తీసుకోవాలి. రాయదుర్గం చుట్టూరా ఉండే కాలనీవాసులంతా వచ్చి నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేస్తున్నారు.

–శ్యామ్‌యాదవ్, రాయదుర్గం

దుర్వాసనకు చెక్ పెట్టాలి



మల్కంచెరువు సేదతీరే, వాకింగ్ చేసే ప్రాంతంగా మారింది.కానీ దుర్వాసనతో సతమతమవుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి. రాబోయే రోజుల్లో బోటింగ్ సౌకర్యం కూడా ఏర్పాటు చేయాలని సంకల్పించారు. దుర్వాసనకు చెక్ పెడితే మరింతమంది వస్తారు.

–వెంకటేష్, మధురానగర్



మల్కంచెరువు వాకింగ్ ట్రాక్





వాకింగ్ ట్రాక్ వద్ద దుర్వాసన వెదజల్లుతున్న ప్రాంతం



పత్రికానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



గచ్చిబౌలి: పత్రికానగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం పత్రికానగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో.. అధ్యక్షులుగా పల్లెమాల సుధాకర్, ఉపాధ్యక్షులుగా ఎం.హేమసుందర్ రావు, ప్రధాన కార్యదర్శిగా కె.రమేష్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా అన్నె నాగేశ్వర్ రావు, శివ ప్రసాద్ రావు, తుమ్మల అమరేంద్ర, కోశాధికారిగా తుమ్మల సుబ్బారావు, ఉప కోశాధికారులుగా రవి కుమార్, రామ కోటయ్య ఎన్నుకున్నారు. సలహాదారులుగా డాక్టర్ చంద్రకాంతరావు, డాక్టర్ ఎం.వి.కె.శివమోహన్, సీహెచ్ ప్రశాంత్ రెడ్డి, కొణిజేటి వేణులు నియమితులయ్యారు. పత్రికానగర్‌లో డ్రైనేజీ , వరద నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని నిర్ణయించారు.

వాహనం ఢీ.. వ్యక్తి మృతి



మియాపూర్ : వాహనం ఢీకొన్న ఘటనలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం...హఫీజ్‌పేటలోని జెన్‌ప్యాక్ ఎదురురోడ్డులో ఓ వ్యక్తి పడి ఉన్నాడని స్థానికులు శనివారం అర్ధరాత్రి మియాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా ఆ వ్యక్తి మృతి చెందాడు. అతనికి సంబంధించిన వివరాలు లేకపోవడంతో చుట్టుపక్కల ఆరా తీయగా సమాచారం లభించలేదు. వ్యక్తికి సుమారు (40) సంవత్సరాల వయస్సు ఉంటుందని పోలీసులు తెలిపారు. వాహనం ఢీకొన్న ఘటనలో మృతిచెంది ఉంటాడని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

పేరుకుపోతున్న చెత్త



మియాపూర్ : మియాపూర్ డివిజన్ పరిధిలో పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మియాపూర్‌లోని జేపీఎన్‌నగర్ నుండి మక్తమహబూబ్‌పేట రోడ్డుకు ఇరువైపులా ఖాళీ ప్రదేశంలో చెత్తకుప్పలు పేరుకుపోయాయి. ఈ రోడ్డు వెంబడి ప్రతివారం సంత జరుగుతుంది. సంతలో పాడైన కూరగాయలు, పండ్లు, చెత్తచెదారాన్ని రోడ్డు పక్కనే ఖాళీ స్థలంలో వేస్తున్నారు. రెండు, మూడు రోజులైనా వ్యర్థాలను తొలగించడం లేదు. దీంతో దుర్వాసన వస్తుంది. అదేవిధంగా దీప్తీశ్రీనగర్ కాలనీలో కూడా రోడ్డు పక్కన ఖాళీ ప్రదేశాల్లో చెత్త పేరుకుపోతోంది. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా రుద్రహోమం



రాయదుర్గం: ధన్వంతరి జయంతి, మాస శివరాత్రిని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో గణపతి, శ్రీసూక్త, ధన్వంతరి, నవగ్రహ, రుద్రహోమాలను వైభవంగా నిర్వహించారు.అనంతరం పూర్ణాహుతి చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం



శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సత్య సాయి సేవా సదన్‌లో మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు.ఈ శిబిరంలో ఎత్తు, బరువు, దంత, రక్తపోటు, షుగర్, ఈసీజీ, ఊపిరితిత్తుల పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ...120 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. శిబిరంలో సత్యసాయి సేవా సదన్ కమిటీ సభ్యులు రామచంద్రమూర్తి, రుద్రరాజు, రాజగోపాలరావు, ఉదయశంకర్, చంద్రమ్మ, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అమ్మయ్య చౌదరి, శివరామకృష్ణ, విష్ణు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సౌకర్యాల కొరత.. విముఖత

- వృథాగా పాపిరెడ్డికాలనీ మల్టీపర్పస్ కమ్యూనిటీహాల్
- ఫంక్షన్లు చేసుకోవడానికి ఆసక్తి చూపని కాలనీవాసులు

శేరిలింగంపల్లి: మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను కోట్లాది రూపాయలతో నిర్మించారు. ప్రజలకు అవసరమైన సౌకర్యాలు లేకపోవడంతో విముఖత చూపుతున్నారు. ఇప్పటివరకు కొన్ని ఫంక్షన్‌లు చేసుకున్నా సౌకర్యాల లేమితో ఆసక్తి చూపడం లేదు. ఈ మల్టీపర్పస్ కమ్యూనిటీహాల్‌ను మూడు కోట్ల వ్యయంతో నిర్మించారు. ఇక్కడ విశాలమైన స్థలం ఉండడంతో పార్కింగ్ సమస్య కూడా లేదు. అయితే పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పిస్తే చుట్టుపక్కల సుమారు 40 వేల మంది జనాభాకు మేలు చేకూరే అవకాశం లేకపోలేదు. ఆ దిశగా జీహెచ్‌ఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- శేరిలింగంపల్లి డివిజన్ పాపిరెడ్డి కాలనీలో నిర్మించిన మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌తో సురభి కాలనీ, రాజీవ్ స్వగృహతోపాటు పరిసరాల ప్రజలకు మేలు చేకూరుతుంది.
- ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌ను తలపించేలా ఉన్నా మంచినీటి సౌకర్యం లేకపోవడం, నిర్వహణ అధ్వానంగా మారడం, ఫంక్షన్లకు సామగ్రి అందుబాటులో ఉంచకపోవడంతో నీటి నుంచి సామాన్లు ఇతర వాటిని బయటి నుంచి తెచ్చుకోవాల్సి వస్తోంది.
- పట్టించుకునేవారు లేక పోకిరీలకు అడ్డాగా మారింది. తాళం, అద్దాలు, లోపలి డోర్లు , లైట్లను పగులకొట్టారు. టాయిలెట్లు దుర్గంధం వెదజల్లుతున్నాయి.
- కోట్ల రూపాయలు పెట్టి నిర్మించిన భవనంలో సౌకర్యాలు కల్పించడంతో బాటు నిర్వహణపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక పటాన్‌చెరు

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- త్వరలో సూర్య దేవాలయం, ఫంక్షన్‌హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన..



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: మినీ ఇండియాగా పేరొందిన పటాన్‌చెరు నియోజకవర్గం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని పాటి గ్రామ శివారులో గల ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఉత్తర భారతీయుల సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దీపావళిని పురస్కరించుకొని ప్రతి ఏటా ఉత్తర భారతీయులు ఘనంగా నిర్వహించుకునే ఛట్ పూజ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తాను రాజకీయాల్లోకి ప్రవేశించిన నాటి నుండి నేటి వరకు ఉత్తర భారతీయులతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నామని తెలిపారు. గతంలో హామీ ఇచ్చిన విధంగా అతి త్వరలో ఉత్తర భారతీయుల కోసం ఫంక్షన్ హాల్, సాకి చెరువు కట్టపైన సూర్యదేవుడి ఆలయం నిర్మించబోతున్నామని తెలిపారు. ఛట్ పూజ సందర్భంగా ఉచితంగా చెరుకు పంపిణీకి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లోనూ మరింత సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీలు యాదగిరి యాదవ్, శ్రీశైలం యాదవ్, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, బీడీఎల్ సీఐ విజయ్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి కృషి

ఆల్విన్‌కాలనీ: షిరిడీనగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆదివారం కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఓపెన్ నాలాకు రిటైనింగ్ వాల్ కొంతమేర పెండింగ్ ఉందని, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కాలనీవాసులు కాలనీ అసోసియేషన్ కార్యాలయం నిర్మించుకుంటామని ఆయన దృష్టికి తీసుకెళ్లగా.. సానుకూలంగా స్పందించి తగిన సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సీహెచ్ శ్రీధర్, వైస్ ప్రెసిడెంట్ అమరేందర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ మూర్తి, ట్రెజరర్ ప్రవీణ్‌సింగ్, సభ్యులు చంద్రమౌళి, ప్రకాష్, ఉదయ్‌కిరణ్, సాయిబాబా, రాజేష్, సురేష్ బాబు, రమేష్, రాంగోపాల్, ఆనందబాబు, మూల్‌చంద్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.





ప్రమాదకరంగా ..



మియాపూర్ : ధ్వంసమైన మ్యాన్‌హోళ్లు ప్రమాదకరంగా మారాయి. మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎంఏనగర్ కాలనీ ప్రధాన రోడ్డులో మూతలు ధ్వంసమైన మ్యాన్‌హోళ్లు దర్శనమిస్తున్నాయి. నెల రోజుల కిందట మ్యాన్‌హోల్ మూతను ఏర్పాటు చేశారు. నాణ్యత లేకపోవడంతో మరలా పాడైంది. ప్రధాన రోడ్డుపై మూలమలుపు వద్ద ప్రమాదకరంగా ఉండడంతో వాహనదారులకు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశముందని స్థానిక ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరగకుండా స్థానికులు మ్యాన్‌హోల్ వద్ద చెట్ల కొమ్మలను ఏర్పాటు చేశారు. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

భవన్స్‌లో దీపావళి వేడుక

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భెల్ టౌన్‌షిప్‌లోని భవన్స్ పాఠశాలలో శనివారం రాత్రి దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీసీపీ సృజన, భవన్స్ హైదరాబాద్ వైస్ చైర్మన్ గోపాలకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాల గురించి పిల్లలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఎంతగానో అకట్టుకున్నాయి. కార్యక్రమంలో భెల్ జీఎం డా.సంధ్యాకర్, ప్రిన్సిపల్ ఉమాశాస్త్రి పాల్గొన్నారు.